www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 04 | సెప్టెంబర్ | 2025 పేజీలు : 8


## ఖమ్మం-వరంగల్ హైవేపై దారి దోపిడీ ముఠా హల్‌చల్



- డ్రైవర్‌పై దాడి చేసి రూ.18వేలు వసూలు చేసిన దుండగులు

2 లో

# ఇది పేదల ఆత్మగౌరవ పండుగ



- పేదల సొంతింటి కల నెరవేరుతోంది
- లక్ష కోట్లు దోచుకున్న కేసిఆర్ పేదలను విస్మరించారు
- వారి ఆస్తుల పంపకపు పంచాయితీ రెచ్చకెక్కింది
- బతుకులు మార్చేది గొర్లు,బర్లు కాదు
- తలరాతలు మార్చేది చదువొక్కటే
- బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి
- పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/చంద్రుగొండ :** ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతోంది, ఇందిరమ్మ గృహ ప్రవేశాలతో పేదల ఆత్మగౌరవ పండుగ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల పరిధిలోని బెండాలపాడు గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు పండుగ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా సిఎం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించి గిరిజనుల ఇందిరమ్మ ఇళ్ల రిబ్బన్ కత్తిరించి గ్రహంలోనికి ప్రవేశించారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి, ఎంఎల్‌ఏ జారే ఆదిన్నారాయణ తదితరులతో పాటు నేలపై ఆశీనులపై ఓ ఇంట్లోని

మిగతా 2లో..

---

## ఒక్క కట్ట కోసం
## తెల్లవారుజాము నుంచే పడిగాపులు




-15 కేంద్రాలకు 110 చొప్పున 1650 కట్టలు సరఫరా

-వందల సంఖ్యలో క్యూ కట్టిన రైతులు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రభుత్వం యూరియా సరఫరా పట్ల రైతులు మండిపడుతున్నారు...ఒక్క కట్ట కోసం తెల్లవారు జాము నుంచే కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు ఒక్క యూరియా కట్ట దొరకక రైతులు భగ్గుమన్నారు. మండలం లోని 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పర పతి సంఘాల తో పాటు యూరియా పంపిణీ కోసం మరో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ప్రతీ కేంద్రం కు 110 యూరియా కట్టలను సరఫరా చేసింది. కాగా ప్రతీ కేందర్రం కు వందలాది మంది రైతులు క్యూ కట్టారు. నేలకొండపల్లి, నాచేపల్లి, రాజారాంపేట తదితర కేంద్రాల వద్ద ఎండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులుకాచారు. అయితే రైతు కు ఒక్క కట్ట మాత్రమే పంపిణీ చేశారు.

మిగతా 2లో..

## జిల్లాలో కొన్ని సమస్యలున్నాయి..
# పరిష్కరించండి



- ఎంఎల్‌ఏ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా పలు సమస్యలు, ప్రజా అవసరాలు ఉన్నాయని, వాటిని తీర్చాలని కొత్తగూడెం ఎంఎల్‌ఏ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల సందర్భంగా జిల్లాలోని చంద్రుగొండ మండల పరిధిలోని దామరచర్ల గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గిరిజనుల పోడు భూములకు పట్టాలివ్వాలని, సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు నీరందించాలని, పాల్వంచ కేంద్రంగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇంటిగ్రేటెడ్ స్కూల్, విమానాశ్రయం వంటివి ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు మేలు జరుగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టిలో ఆలోచిస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.

# ఇది పేదల ఆత్మగౌరవ పండుగ

(మొదటిపేజీ తరువాయి)

బాలునికి మిఠాయి తినిపించిన ఆయన అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామంలోని మహిళలంతా సంతోషంగా ఉండాలని, రాబోయే పదేళ్లలో మరిన్ని ఇళ్లను నిర్మించుకుందామని, మీ పిల్లలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇద్దామని అన్నారు. అక్కడ్నుంచి బయలు దేరి దామరచర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వద్దకు చేరుకున్నారు. అశ్వారావుపేట ఎంఎల్‌ఎ జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇళ్లులేని ఊరేలేదని, ప్రతీ ఏటా ప్రభుత్వం రూ.22500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేస్తోందన్నారు. నియోజకవర్గానికి 3500 ఇళ్లు ఇస్తే ఈ నియోజకవ్రగంలో మాత్రం అదనంగా మరో వెయ్యి ఇళ్లను మీ ఎంఎల్‌ఎ తీసుకున్నారని చెప్పారు. తెలంగాణ ఉధ్యమానికి ఊపుర్లి ఊదిన ఈ జిల్లా చాలా చైతన్యవంతమైందని, అందుకే నేను ఈ జిల్లాలోనే అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని భద్రాచలంలో గత ఏడాది మార్చి 11న ప్రారంభించామని, ఇప్పుడు ఆ పథకంలో నిర్మిచింన ఇళ్లను ఇదే జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున గృహప్రవేశాలు నిర్వహించామని చెప్పారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని, అందుకే అధికారంలోనికి పచ్చిన అనతి కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు సిఎం తెలిపారు. ఇందిర్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచితకరెంట్, సబ్సిడి గ్యాస్, రైతురణమాఫీ, మహిళలకు ఉచిత ప్రయాణం వంటి వాటితో పాటు అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నామన్నారు.పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ పేదలను విస్మరించి ఆ పార్టీ పెద్ద కేసిఆర్ లక్ష కోట్ల ఆస్తులను పోగేసాడని, ఇప్పుడు దోచుకున్న ఆస్తులను పంచుకునేందుకు రచ్చకెక్కుతూ మా పై బురద జల్లుతున్నారని యద్దేవా చేశారు. పదేళ్లపాటు ప్రజలకు మాయమాటలు చెప్పి కాలం వెల్లదీశారని, రేషన్ కార్డులు, పేదల ఇళ్లు ఇవ్వలేదని, కేసిఆర్ దత్తతు తీసుకున్న గ్రామంలోనే ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌ది మాటలు ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఇచ్చిన మాటను నిలబెట్టుకు




నేందుకు, ప్రజలకు మేలు చేసేందుకు ఎందాకైనా పోతామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల బ్రతుకులు మారాలని తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోందని చెప్పారు. గత పాలకులు బర్లు, గొర్లు ఇచ్చి ఎక్కడి వారిని అక్కడే ఉంచిందని, కానీ తలరాతాలు మార్చేది చదువొక్కటే అని, తెలంగాణ బిడ్డలు చదువుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోబోతోందని, డాక్టరు, ఇంజనీర్లు, కలెక్టర్లుగా ఎదిగి ప్రపంచ దేశాల్లో తెలంగాణ బిడ్డలు మెరవాలని అన్నారు. ఇందుకోసం ప్రతీ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను అన్ని రకాల హంగులతో ఏర్పాటు చేయబోతున్నట్లు స్పష్టం ప్రకటించారు. ఉన్నతంగా చదువుకునే వారికి ప్రభుత్వం అండదండలు ఉంటాయని, పేదరిక నిర్మూలన చదువుతో సాధ్యమని చెప్పారు. అనంతరం గృహనిర్మాణ, రెవెన్యూ, సమచారా శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీహరి, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట ఎంఎల్‌ఎ జారే ఆదినారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపి పోరిక బలరామ్ నాయక్, ఎంఎల్‌ఏలు కూనంనేని సాంబశివరావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, డా. తెల్లం వెంకట్రావు, రామ్ దాస్ నాయక్,




మట్టా రాగమయి, వివిధ సంస్థలు చైర్మన్‌లు మువ్వా విజయ్ బాబు, పసుపులేటి వీరబాబు, హౌసింగ్ ఎండి గౌతమ్, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడిఏ పిఓ రాహుల్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఏఎస్‌పి విక్రాంతి సింగ్ కుమార్, డిఎస్‌పి రెహమాన్‌తో పాటు కాంగ్రెస్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానాలు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క కట్ట కోసం
# తెల్లవారుజాము నుంచే పడిగాపులు

(మొదటిపేజీ తరువాయి)

వందలాది మంది రైతులకు అధికారులు కూపన్లు జారీ చేశారు. వచ్చిన 110 కట్టలకు గాను.... దాదాపు 200 మందికి పైగా కూపన్లు జారీచేశారు. ఉన్న స్టాక్ అయిన తరువాత రైతులు నిలదీశారు. కట్టలు లేనప్పుడు ఎందుకు కూపన్లు జారీ చేశారు అంటూ అధికారులను నిలదీశారు. దీంతో పలు చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీస్ పహారా నడుమ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఖమ్మం ఆర్డీవో నరసింహారావు మండలం లోని మోటాపురం, రాజేశ్వరపురం కేంద్రాలను ఆకస్మికంగాపరిశీలించారు.రైతులు, అధికారులతో మాట్లాడారు..రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా రైతు కు కనీసం మూడు కట్టలు అందించాలని మోటాపురం సోసైటీ మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు, బెల్లం శ్రీనివాసరావు లు ఆర్డీవో కు వినతి పత్రం అందించారు. అనంతరం ఆర్డీవో అధికారులకు పలు సూచనలు చేశారు. పంపిణీ లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా



అప్రమతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల వ్యవసాయాధికారి యం.రాధ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు భవాని, ధాత్రి తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యాన్ని చాటండి

### -సిపిఐ నాయకులు సలాం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశ వ్యాప్తంగా మతోన్మాద శక్తులు దేశ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న వేళ ప్రజలు మత సామరస్యాన్ని పాటిస్తూ ఐక్యత చాటాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం తెలిపారు. రాజకీయ లబ్ది కోసమే మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆయన తెలిపారు. బుధవారం స్తంభాద్రి గణేష్ ఉత్సవ కమిటీ



ఆధ్వర్యంలో నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సలాం మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రజలు కలిసిమెలిసి ఉండాలని మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఉత్సవాలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, పార్టీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్‌కె సైదా, జ్వాలా నర్సింహారావు, అక్బర్, ఖాదర్, ఉపేందర్ యాదవ్, నవీన్‌రెడ్డి, జిలానీ, రమణ, రవీంద్రాచారి, సత్యం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం-వరంగల్ హైవేపై దారి దోపిడీ ముఠా హల్‌చల్

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** దారిదోపిడి దొంగలు అంటే ట్రైన్లలో అడవుల్లో పోయే వాహనాలను ఆపి బెదిరించి డబ్బులు వసూలు చేసే ముఠాలను పేపర్లలో టీవిలలో సినిమాల్లో చూశాం. ఇలాంటి సంఘటనలు తిరుమలాయపాలెం మండలంలో ఇటీవల ఎక్కువ చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది డ్రైవర్లు వాహనాల్లో డీజిల్ పోతున్న ఫిర్యాదు ఇవ్వకుండా వెళ్లిపోతున్నారు. లారీ డ్రైవర్ దిలీప్ ముచ్చర్ తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రి నుండి గుజరాత్ వైపు లారీ నెంబర్ జిజె36 వి 8373 ఖమ్మం వరంగల్ హైవే నుండి బుధవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో వెళ్తుండగా ఖమ్మం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న శ్రీసిటీ దగ్గర నుంచి లారీని వెంబడించిన దుండగలు టిఎస్04 యుఇ 3405 నెంబర్ గల ఆటోలో నలుగురు, దిచక్ర వాహనంపై ఒకరు శ్రీ సిటీ వద్ద నుండి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వెంబడించగా చింతపల్లి సమీపంలో లారీని నిలిపివేయగా డ్రైవర్‌ను లారీ ఆపకుండా వస్తున్నావ్ ఏందిరా అని కొట్టి నీ దగ్గర ఎన్ని డబ్బులు ఉన్నాయి మొత్తం ఇచ్చేయమని అడగగా డబ్బులు ఇవ్వకుంటే చంపుతామని బెదిరించారని, బెదిరిపోయిన డ్రైవర్ రూ.8వేలు నగదు ఇచ్చాడు. ఈ క్రమంలో లారీని నడుపుకుంటూ ముందుకు వెళ్లిన లారీ డ్రైవర్ తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు స్టేజి వద్ద జిన్నింగ్ మిల్లు దగ్గరలో ఉన్న గుజరాతీ హోటల్‌లో లారీ ఆపివేసి ఉండగా మళ్లీ అదే దుండగలు అక్కడికి వచ్చి డ్రైవర్‌ను కొడుతూ ఇంకా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా నాదగ్గర క్యాష్ లేవని అని చెప్పగా ఫోన్ పే నుంచి కొట్టరా అంటూ బెదిరించగా నా ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉందని చెప్పడంతో క్యాంటీన్ ఓనర్ ఫోన్ నుంచి లారీ ఓనర్‌కు ఫోన్ చేసి రూ.10వేలు 9515605367 కత్తుల మోహన్‌చంద్ర అనే పేరుకు కొట్టడం జరిగింది. ఇదంతా మొదటి నుండి గమనిస్తున్న లారీ క్లీనర్ శ్రీ సిటీ నుంచి లారీని వెంబడించే వీడియోను జరిగిన సంఘటనలు మొత్తం తన ఫోన్లో రికార్డు చేశాడు. అనంతరం దుండగులు అక్కడి నుండి ఆటోలో మళ్లీ ఖమ్మం వైపు వెళ్తుండగా ఖమ్మం రూరల్ పోలీసులు ఏదులాపురం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వక్తులను గుర్తించి ఆటోలో రాడ్లు ఉండగా ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరుమలాయపాలెం పరిధిలో జరిగిన సంఘటనకు వాళ్లే కారణమని అని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బాధితులు మాత్రం స్థానిక తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# బెండాలపాడులో చారిత్రక ఘట్టం

### -ముఖ్యమంత్రిచే ఇందిరమ్మ గృహాల ప్రారంభం

**ప్రజాపక్షం/ఖమ్మం/చంద్రుగొండ :** బెండాలపాడు వెనుకబడిన గిరిజన ప్రాంతం. చుట్టూ అడవి మధ్య ఉండే ఈ గ్రామంలో బుధవారం ఆనందం వెల్లివిరిసింది. ఓ చారిత్రక ఘట్టానికి మారుమూల గ్రామం బెండాలపాడు వేదికైంది. ఎన్నో దశాబ్దాలుగా ఎదురు చూసినా సొంతింటి కల నెరవేరింది. ఇందిరమ్మ గృహ నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం చేయూతతో లబ్దిదారులు నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు.



పేదవాడి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం నిబద్ధతతో చేపట్టిన పనికి ఇది ఓ నిదర్శనమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దశాబ్దం పాటు ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్‌ఎస్ ప్రజల ఆశలను ఆడియాశలు చేసిందన్నారు. రాష్ట్రంలో 23 లక్షల ఇండ్ల నిర్మాణం జరుగుతుందని పేదలకు ఆత్మగౌరవం, భరోసా ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ లబ్దిదారులు గృహప్రవేశ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది ఆరంభమేనని పెద్ద ఎత్తున మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# అన్నదానం అభినందనీయం



**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని అన్నదానం చేయడం అభినందనీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. బుధవారం ఏదులాపురంమున్సి పాలిటీపరిధిలోని ఏదులాపురం ఎస్‌సీ కాలనీలో ఫ్రెండ్స్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత దండి సురేష్‌రాజేశ్వరి దంప తులు వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. వీరిని కమిటీ సభ్యులు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నిమ జ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. నవరాత్రిలో చూపిన నిగ్రహాన్ని శోభాయాత్రలో సైతం చూపించాలన్నారు. అలాగే కామంచికల్‌లోని నాలుగోవార్డులో స్నేహ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల సమితి సభ్యులు దండి రంగారావు, ఘనపారపు వీరన్న, మామిడి సుదర్శన్‌రెడ్డి, వెన్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# లంబాడీలపై కుట్ర జరుగుతుంది..

**-స్థానిక ఎన్నికల్లో సత్తా చూపిస్తాం**
**-బంజారా అడ్వకేట్ జేఏసి నాయకులు హరి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలో లంబాడీలపై కుట్ర జరుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి దీనికి ఫుల్‌స్టాప్ పెట్టాలని బంజారా అడ్వకేట్ జేఏసి నాయకులు హరి నాయక్ డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో హరినాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన సందర్భంగా లంబాడీ నాయ కులను, యువతను అరెస్టు చేశారని బేషరతుగా వారిని విడుదల చేయా లని కోరారు. లంబాడీలు ఎస్టీలు కాదంటూ తెల్లం వెంకట్రావు, సోయం బాబురావు కోర్టులో పిటిషన్ వేశారని ఇది చెల్లదని దానిని ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావు పిటిష న్‌ను ఉపసంహరించుకునేలా చూస్తామని ఇల్లందు ఎంఎల్ఏ తనతో పేర్కొన్నారన్నారు. లంబాడీలను అశ్రద్ధ చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోని 10 నియోజక వర్గాల్లో బస్సు యాత్ర చేస్తామన్నారు. ఈ బస్సు యాత్ర పాలేరు నుంచి ప్రారంభమవు తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లంబా డీల సత్తా చూపుతామన్నారు. ఏజెన్సీ ఏరియాలో ఉద్యోగాలు కల్పించిన జీవో 3ని కొట్టి వేసినప్పుడు ఆదివాసీ ఎంఎల్ఏలు ఎవరు మాట్లాడలే దని ఇప్పుడు మాత్రం గిరిజనుల మధ్య విద్వేషాలను పెంచుతున్నార న్నారు. కోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాల న్నారు. ఈ సమావేశంలో దరావత్ వీరన్న, దేవేందర్, శ్రీకాంత్, బానోత్ తులసీబాయి, నరేంద్ర నాయక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతిపై మాట్లాడే అర్హత కమల్‌రాజుకు లేదు



**ప్రజాపక్షం/ మధిర :** గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎంత అవినీతి జరిగిందో ప్రజలకు తెలుసునని, అవినీతిపై మాట్లాడే అర్హత వార్డు మెంబర్‌కు పనికిరాని కమల్‌రాజుకు లేదని మండల కాంగ్రెస్ అధ్య క్షులు సూరంశెట్టి కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాల యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనతో విసుగుచెందిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పెద్దపీట వేసిందన్నారు. కమీషన్లకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బిఆర్ఎస్ పార్టీలోని పై స్థాయి నుండి కిందిస్థాయి వరకు కమీషన్ల మీద బతికిన చరిత్ర మీది అని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మధిర నియోజకవర్గ అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఘనత భట్టివిక్రమా ర్కకే దక్కుతుందన్నారు. అలాంటి భట్టివిక్రమార్కను విమర్శించే అర్హత బిఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవి నీతిని గుర్తించిన ముఖ్యమంత్రి సిఎం రేవంత్‌రెడ్డి దీనిపై సిబిఐకి అప్ప గించి విచారణ చేపట్టాలని ప్రయత్నం చేస్తుంటే, తమ బాగోతం ఎక్కడ బయటపడుతుందోనని అక్కసుతో నీచ రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలుతూ బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు వారి స్థాయిని తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావే శంలో మండల కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంప వెంకటేశ్వర్లరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జహంగీర్, నాయకులు పత్తేపరపు సంగయ్య, ఆవుల శ్రీను, దూదే కుల జాని తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీని రద్దు చేయాలి





**ప్రజాపక్షం/ మధిర :** రాయపట్నం గ్రామంలో అర్హులందరికీ ఇళ్లు రాలేదని ఇందిరమ్మ కమి టీలు వెంటనే రద్దు చేయాలని సిపిఎం డివిజన్ నాయకులు పాపినేని రామనర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాయపట్నం గ్రామస్తులు తహశీల్దార్ ఎంపిడిఓ కార్యాలయాల ఎదుట సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయ పట్నం గ్రామంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు రాలేదని, అర్హత లేని వారి ఇండ్లను రద్దు చేయాలని, దళితవాడపై వచ్చే వరదనీటి ప్రవాహాన్ని దారి మళ్లించాలని, వెంటనే డ్రైనేజి నిర్మాణాన్ని చేపట్టాలని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని, తడికల ఇళ్లకు, వితంతు, ఒంటరి మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మధిర తహశీల్దార్ రాంబాబుకు అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పెంటి వెంకట్రావు, తేల ప్రోలు రాధాకృష్ణ, ఎం.జ్యోతి, కె.అన్నమ్మ, పి.మరియమ్మ, ఇనుపలూరి పుల్లమ్మ, ఎస్.సత్యవతి, పి.లక్ష్మీ, దేవరకొండ రావులమ్మ, ఎం.సురేష్, గద్దల ఏసుపాదం, ఎం.ఆదాం తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపం వద్ద అన్నదానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వినా యక నవరాత్రోత్సవాల్లో భాగంగా గణేష్ మండ పం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధ వారం ఖమ్మం నగర పరిధిలో 26, 37వ డివిజన్ నందు శ్రీ శివశక్తి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ పునుకొల్లు నీరజ, ఉప మేయర్ ఫాతిమాజోహరా పాల్గొని ప్రారంభించారు. వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయకునికి గరిక పూజ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా వినాయ కునికి గరిక పూజ నిర్వహించారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఇందిరా నగర్ వద్ద గల బాల గణ పతి దేవాలయంలో నవరాత్రోత్స వాల్లో భాగంగా వినాయకునికి గరిక పూజ నిర్వహించారు. పలువురు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొని గరికతో వినాయకున్ని పూజించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాజిన్ని వీరయ్య, ఈవో నర్సింహారావు, అర్చకులు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ పును కొల్లు నీరజ పరిశీలించారు. బుధ వారం ఖమ్మం నగరంలోని 15వ డివి జన్‌లో జరుగుతున్న అభివృద్ధి పను లను మేయర్ పరిశీలించి పలు సూచ నలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగర అభివృద్ధితో పాటు కార్పొరేషన్‌లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావూరి కరుణ సైదబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యకు 360ఏఏఏ+రేటింగ్




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్లు పంచా యతీ పరిధిలోని శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసె ర్చ్‌కు కెరీర్స్ 360 ఏఏఏ+రేటింగ్ లభించింది. ఇది ప్రతిష్ఠాత్మకమైన ఇండియాస్ బెస్ట్ ఇంజనీరింగ్ ఇన్సి ట్యూషన్స్ 2025కేటగిరీ ద్వారా సాధించింది. ఈ సందర్భంగా కళా శాల చైర్మన్ శ్రీ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడారు...యాజమాన్యం తోడ్పాటుతో ఫ్యాకల్టీ విద్యార్థు లకు ఇచ్చిన బోధనలతో సాధ్యమైందన్నారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పరిశ్రమ, ఐఐటీ వంటి విద్యాసంస్థలతో ఎమ్ఓయులు, పరిశోధన వంటి సౌలభ్యాలు అందుతా యన్నారు. అనంతరం రేటింగ్ వచ్చిన శుభసందర్భంగా బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, శ్రీవిద్య, ప్రిన్సిపాల్ జె. లక్ష్మి నారాయణ, అకాడమిక్ డీన్ డాక్టర్ వి.సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, పాలిటెక్నికల్ ఇన్చార్జి సిహెచ్ కృష్ణప్ర సాద్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ చిరంజీవి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ జ్యోతి, శ్రీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అటెండర్ భాస్కర్ మృతి బాధాకరం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర రెవెన్యూశాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న దెందుకూరు గ్రామానికి చెందిన పగిడిపల్లి భాస్కర్‌రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మధిర తహశీ ల్దార్ రాళ్లబండి రాంబాబు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సాను భూతిని తెలిపారు. అటెండర్ భాస్కర్ అకాల మృతి చాలా బాధకరమని అన్నారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ భానుప్రసాద్, శిరీష, జూనియర్ అసిస్టెంట్ గోపాల్, మానస, సరిత, సుజాత, వాసు, షరీఫ్, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## మహా అన్నదానం



ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీ పరిధిలోని జిలుగు మాడులో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు యన్నం కోటేశ్వర రావు, రజి ని దంపతుల ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని మధిర సిఐ. డి.రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తాలు ప్రారంభించారు. గ్రామంలోని సుమారు 1500 మంది భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరువీదుల వెంకటేశ్వావు, టిడిపి నాయకులు రావూరి రంగారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు దోర్నాల రవి, కమిటీ సభ్యులు కంచర్ల శ్రీను, వీరంశెట్టి సీతారామయ్య, చెన్నం శెట్టి నరేష్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సమ్మెట అంజమ్మ మృతి పట్ల సిపిఐ సంతాపం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని విఠల్ రావు నగర్ గ్రామానికి చెందిన సమ్మెట అంజమ్మ అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందింది. విషయం తెలియగానే సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, మాజీ వార్డు మెంబర్ కనితి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి బొజ్జ సదానందం, మంద కోటేశ్వరరావు, నరసయ్య, రాజయ్య తదితరులు హాజరై పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## సీఎం సభకు తరలిన మహిళలు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘ సభ్యులు బుధవారం చంద్రుగొండ మండలంలోని బెండాలపాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు తరలి వెళ్లారు. మండల పరిధిలోని పెద్ద కోరుకొండి, చిన్న కోరుకొండి, ముచ్చవరం, చెన్నూరు, లింగాల, కల్లూరు, పేరువంచ తదితర గ్రామ సమైక్యాలనుంచి స్వయం సహాయక సంఘాల సభ్యులు వివోఏలు, సీసీలు, తరలి వెళ్లారు. మహిళల్లో పలు సంక్షేమ పథకాలు మహిళలకు ప్రవేశ పెట్టడం పట్ల వారిలో సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నట్లు చర్చించుకుంటున్నారు.

## నేత్రదానం




ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలం కొత్త కారాయిగూడెం గ్రామానికి చెందిన దొడ్డపనేని భాగ్యమ్మ (77) బుధవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఖమ్మం నేత్ర నిధికి టెక్నీషియన్ నాగేశ్వరరావు ద్వారా 2 నేత్రాలను సేకరించి ఖమ్మం నేత్ర నిధికి పంపించారు. ఈ కార్యక్రమం గ్రామ పెద్దలు మేడా రామారావు, వారి కుటుంబ సభ్యులు చలమాల నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండల కేంద్రం నుండి వేలాదిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం సభకు తరలి వెళ్లారు. చంద్రుగొండ మండలం బెండాల పాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై దామరచర్లలో జరిగే బహిరంగ సభ నిర్వహించనున్నారు. సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గం నుండి వందలాది బస్సులు, కారులు, వేల సంఖ్యలో బైకులలో కాంగ్రెస్ సభను విజయవంతం చేసేందుకు పెనుబల్లి మండల కేంద్రం వద్దకు చేరుకొని అక్కడ నుండి సభా ప్రాంగణానికి బయలుదేరారు.

## టిప్పర్‌ను ఢీకొని యువకుడి మృతి



ప్రజాపక్షం/పాల్వంచ : ద్విచక్ర వాహనంపై వస్తున్న ఓ యువకుడు తన ముందున్న టిప్పర్‌ను ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన జర్పుల చరణ్ (22 ) తన మోటార్ బైక్ పై భద్రాచలం రోడ్ నుండి కొత్తగూడెం వైపునకు వెళుతున్నాడు. ఈ క్రమంలో పాల్వంచ నుండి దమ్మపేట సెంటర్ మీదుగా ములకలపల్లి వైపునకు వెళుతున్న టిప్పర్ లారీ మూలమలుపు తిరుతున్న సమయంలో వెనుకనుండి బలంగా ఢీకొనటంతో మృతి చెందాడు. మృతుడి బందువుల ఫిర్యాదు మేరకు పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# సీజనల్ వ్యాధులు తస్మాత్ జాగ్రత్త..!

**-ఏజెన్సీల్లో అధికమవుతున్న జ్వర పీడితులు**
**-జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు**
**-అప్రమత్తంగా ఉండకపోతే అంతే..**
**-వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత అత్యవసరం**




ప్రజాపక్షం/మణుగూరు: ఏజెన్సీలలో జ్వర పీడితులు అధికమవుతున్న అధికమవుతున్నారు. మణుగూరు సబ్ డివిజన్లో రోజు రోజుకి కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల మురుగునీరు నిలిచి దోమలు వేగంగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా ఇలాంటి విషజ్వరాలు వచ్చే ప్రమాదం లేకపోలేదు. వర్షాకాలం అవడంతో గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం కారణంగా జ్వర పీడితులు పెరుగుతున్నారు. గ్రామ పంచాయతీలో దోమల నివారణకు స్థానిక అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా దోమల ద్వారా వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందే ఉన్నందున వాటిని నిర్మూలించే విషయంలో చర్యలు తీసుకోవడం లేదంటూ గ్రామా వాపోతున్నారు. అనేక మార్లు వార్తలు ప్రచురించినప్పటికీ అవకాశాలుగతంలో శ్రీ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్లక్ష్యం మృత్యువాత కారణంగా పడిన అధికారుల ఎంతో మంది సంఘటనలు చాలా ఉన్నాయి.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది...**

వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు వ్యాప్తి చెందుతూ ఉంటాయి. ముఖ్యంగా జ్వర పీడితులతో ఆసుపత్రులన్నీ కిటకిట లాడుతున్నాయి. జ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఈ సీజన్లో ఎక్కువగా వ్యాప్తి చెందే వ్యాధి మలేరియా. ఇది ప్లాస్మోడియం పరాన్నజీవి ఎక్కువగా ఆడ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. కాలువలు, కుంటలు, పొలాల్లో ఎక్కువగా ఉంటాయి. ఈ దోమ కుట్టినప్పుడు జ్వరంతోపాటు తలనొప్పులు వస్తుంటాయని, అలాంటప్పుడు తక్షణమే వైద్యశాలలను సంప్రదించాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఈ జాగ్రత్తలతో పాటు ఆహారం మంచినీటి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు సోకే అవకాశం తక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

**ఆహార నియమాలు కచ్చితంగా అనుసరించాలి...**

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు పాటించాలని, ఆహార నియమాలు కచ్చితంగా అనుసరించాలని, నీటిని కాచి చల్లార్చి వడబోసిన నీటిని సేవించాలని అలాగే వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈగలు, దోమలు వాలిన పదార్థాలను చిరుతిండ్లకు దూరంగా ఉంచాలి. వీలైనంత మేరకు తాజా కూరగాయలను తీసుకోవాలి. ప్రధానంగా దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలి. ఇండ్లలోకి దోమలు చొరబడకుండా కిటికీ తలుపులను మూసివేయడం మంచిది. ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం వలన వ్యాధుల బారి నుండి కాపాడుకోవచ్చు.

## పత్తి దిగుమతి సుంకాలు తగ్గించడాన్ని నిరసిస్తూ జీఓ కాపీల దహనం

**-పత్తికి ఎంఎస్‌పి క్వింటాకు రూ.10,075 ప్రకటించాలి**
**-ముడి పత్తిపై దిగుమతి సుంకం రద్దు చేయవద్దు**
**-సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) డిమాండ్**



ప్రజాపక్షం/దమ్మపేట: ముడి పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ జీవో కాపీలను బుధవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) నాయకులు, అఖిలభారత ఐక్య రైతు సంఘం ఏఐయుకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు సుంకిపాక ధర్మ లు మాట్లాడుతూ పత్తికి ఎంఎస్‌పి సి 2ప్లస్50 శాతంతో క్వింటాకు రూ.10,075 చొప్పున ప్రకటించాలని, ఆత్మహత్య చేసుకున్న బాధిత రైతు కుటుంబానికి రూ.25 లక్షలు చొప్పున పరిహారంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమానికి, వ్యవసాయ రంగానికి నష్టం చేసే ఫారెన్ ట్రేడ్ అగ్రిమెంట్ (ఎఫ్‌టిఎ)ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పత్తిపై దిగుమతి సుంకాన్ని రద్దు చేసే నోటిఫికేషన్ పత్రాలను దగ్ధం చేయాలని ఎస్ కే యం ఇచ్చిన పిలుపు మేరకు జీవో కాపీలను దగ్ధం చేయటం జరిగిందన్నారు. పత్తి పండించే గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించి, సి2ప్లస్50 శాతం ఎంఎస్‌పికి తీర్మానాలను గ్రామసభల్లో ఆమోదించాలని సూచించారు. మండల కేంద్రాల్లో, జిల్లా వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యుల కార్యాలయాలను, నివాసాల ముట్టడికి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10 వ తేదీన కొత్తగూడెం లో జరిగే జిల్లా సదస్సు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి శ్రీనివాసరావు, కురసం ముత్యాలరావు, కేసరి వెంకటేష్, మురహరి రఘు, గంగాధర నాగమణి, జుంజునూరి ముక్తేశ్వరి, జుంజునూరి నాగరాజు, రావుల శోభన్, బాబు,నక్క నాగమణి, ఎస్ కే జానీబీ తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక చర్యలను ఉపసంహరించుకోవాలి




ప్రజాపక్షం/పాల్వంచ : కేంద్రంలోని బిజేపి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సంయు క్త కిసాన్ మోర్జా నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ముడిపత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని ఎత్తవేస్తూ తీసుకొన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వామ పక్ష పార్టీల అనుబంధ రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటి తహశీల్దార్ అందజేశారు. అనంతరం రైతు సంఘం నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, తులసీరామ్, కే. కిషోర్‌లు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడి రైతు, కార్మికులకు వ్యతిరేకంగా బడా పెట్టుబడీదారులకు, విదేశీ పాలక వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దేశంలో పత్తి ధరలు తగ్గిపోయి రైతాంగానికి తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజేపి అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలంలో దేశంలో సగటున రోజుకు 31 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల కన్నా దుర్మార్గంగా బిజేపి ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా సకాలంలో యూరియా సరఫరా చేయటం లేదని ఆరోపించారు. స్వామినాథన్ కమీషన్ సిఫారసుల ప్రకారం పత్తికి సి2 ప్లస్ 50 శాతం కలిపి కింటాకు 10,075/ల మద్దతు ధర ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకొన్న రైతులకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, దిగుమతి సుంకాలపై కేంద్ర తీసుకొన్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్ మాస్‌లైన్, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల అనుబంధ రైతు, కార్మిక సంఘాల నాయకులు శనిగారపు శ్రీనివాసరావు, నిమ్మల రాంబాబు, సత్యవాణి, రాయబారపు వెంకటేశ్వర్లు, జి. రమేష్, మంకెన వెంకటేశ్వర్లు, కొంగర అప్పారావు, బానోత్ రంజిత్, డి. చెన్నయ్య, ఎస్‌కే. కరీం, టి. విజయరావు, నిరంజన్, రెహమాన్, వి.రమేష్, మౌలాలి, కే. పద్మ, వి. రాములు, బి. వెంకన్న, కే. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో తలుపులు లేని గదులు, కిటికీలు

**- దోమల స్వైర విహారం**
**- జ్వరాల బారిన పడుతున్న విద్యార్థులు**
**- తల్లిదండ్రులకు నో ఎంట్రీ !**






ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ బొల్లోరుగూడెంలో గల మణుగూరు తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్సియల్ గురుకుల కళాశాల/పాఠశాలలో పలువురు విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. గదులకు, కిటికీలకు తలుపులు లేకపోవటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫ్యాన్‌లు ఎప్పుడు తిరుగుతాయే, ఎప్పుడు ఆగిపోతాయే తెలియని పరిస్థితి నెలకొంది. పడుకున్నా దోమలు, కూర్చున్నా దోమలు అనే రీతిలో విద్యార్థులపై పడుతున్నాయి. దీనితో పలువురు విద్యార్థులు డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల భారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గదులకు, కిటికీలకు తలుపులు బిగించకుండా పాఠశాల ప్రిన్సిపాల్ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. సరైన మౌళిక సౌకర్యాలు లేకపోవటంతో పలువురు విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించటం లేదని తెలుస్తోంది. గదులకు తలుపులు లేకపోవటంతో చద్దర్లు కట్టుకొని పడుకుంటున్నారు. కనీసం మరుగుదొడ్లకు కూడా తలుపులు లేవంటున్నారు. తమ పిల్లలను చూడటానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థుల పేరెంట్స్‌ను కూడా లోపలికి అనుమతి లేదంటూ ప్రిన్సిపాల్ హుకుం జారీ చేస్తుండటంతో తల్లిదండ్రులు నిరాశతో వెనుదిరిగి పోతున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. గత సోమవారం మణుగూరు సింగారం నుండి ఓ విద్యార్థి తండ్రి తన కుమారుణ్ణి చూసి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలనుకొని వచ్చాడు. సుమారు గంటకు పైగా వేచి చూడాల్సివచ్చిందని వాపోయాడు. విద్యార్థి పేరు వెల్లడిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని భయానికి లోనయ్యాడు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ సైతం సరైన రీతిలో అందించడం లేదని దీనిపై ప్రశ్నించిన విద్యార్థుల పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బందితో వేధింపులకు గురిచేస్తారనే వదంతులు వినిపిస్తున్నాయి. అంతా ఆయన తన ఇష్టారీతిన వ్యవహరిస్తారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి వసతి గృహాన్ని పరిశీలించి మౌళిక వసతులు కల్పించాలని, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్న పాఠశాల ప్రిన్సిపాల్ పై తగు చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

**అనుమతి లేదు...**

ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్ కీసర నాగేశ్వరరావును వివరణ కోరగా ఎంతటి వారినైనా లోపలికి అనుమతించేది లేదు. ఇది ఉన్నతాధికారుల ఆదేశమన్నారు. ఏమైనా చేసుకోండని దురుసుగా సమాధానం ఇవ్వడం ఆయన నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. ఇక్కడ అన్ని వసతులు సరిగానే ఉన్నాయన్నారు.

## నిర్వహణకు నిధులు రాక ఇబ్బందులు పడుతున్న ప్రధానోపాధ్యాయులు




ప్రజాపక్షం/కల్లూరు: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు నిర్వహణ కు రికార్డులు, చాక్ పీసులు, తెల్ల కాగితాలు, జాతీయ పండుగల కు నిర్వహణ కొరకు ఖర్చులు, ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య ప్రకారం 5000 నుంచి అదనంగా విద్యార్థులను బట్టి నిధులు ప్రతి సంవత్సరం ప్రారంభ సమయంలో అందిస్తారని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. కానీ నేటికీ నిర్వహణ నిధులు పాఠశాలలకు అందనందున ప్రధానోపాధ్యాయులు అప్పులతో పాఠశాల నిర్వహణ నిర్వహిస్తున్నామని పేర్కొంటున్నారు. మండలంలో 60 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పనిచేస్తున్నవి. వాటిలో ఒకటి నుంచి పది వరకు 5000 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలలో నిర్వహణకు ప్రతి సంవత్సరం గ్రాంట్ ను అందిస్తారు కానీ మూడు నెలలు గడిచిన నేటికీ గ్రాంట్ కానందున అప్పుల పాలవుతున్నామని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రావాల్సిన మైనర్ మరమ్మత్తులు స్టేషనరీ ప్రయోగశాల సామాగ్రి వివిధ కార్యక్రమాలకు నిర్వహణ ఇతర బిల్లులు చెల్లింపులు జరపాలి కనీసం సగం నిధులైన మంజూరు చేసి ఉంటే బాగుండేదని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. క్రీడల పైన నిర్లక్ష్యం క్రీడలు నిర్వహణకు నిధులు వచ్చేవని ఈ సంవత్సరం అవి కూడా రాలేదని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు మంజూరు చేసి చేయాలని ప్రధానోపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## ఆదివాసి కుటుంబాలకు దోమతెరల పంపిణీ



ప్రజాపక్షం/పినపాక: మండలంలో హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక ఆదివాసి కుటుంబానికి చెందినటువంటి సామాజిక కార్యకర్త, ఆదివాసి యువ నాయకుడు పేదల పెన్నిధి, ఎందరో వికలాంగులకు కాళ్లు చేతులు వంటి కృత్రిమ అవయవాలను చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేసిన మహానుభావుడు, ఆదివాసి కుటుంబాల్లో ఉదయించినటువంటి సూర్యుడు తోలం శ్రీనివాస్ దోమతెరలను పంపిణీ చేశారు. బుధవారం మండల పరిధిలో గల తిర్లాపురం పిట్టతోగు 68 ఆదివాసి కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేశామని తోలం శ్రీనివాస్ తెలియజేశారు. పిట్టతోగు గ్రామంలో నివసిస్తున్న 32 కుటుంబాలకు దాతలు గణేష్ రావు (డిప్యూటీ సెక్రెటరీ విద్యుత్ శాఖ), సోమయాజులు దోమ తెరలు అందించారు. తిర్లాపురం గ్రామంలో నివసిస్తున్న 36 కుటుంబాలకు దాతలు జయమ్మ, గణేశం సహకారంతో దోమ తెరలు పంపిణీ చేశారు. రోడ్డు మార్గం, కరెంటు ఎటువంటి సౌకర్యం లేకుండా అడవులలో నివశిస్తున్న ఆదివాసి కుటుంబాలకు ఈ వర్షాకాలంలో దోమకాటుతో అనారోగ్య బారిన పడకుండా దోమతెరను అందిస్తున్నామన్నారు. గతంలో కూడా ట్రస్ట్ ఆధ్వర్యంలో చలికాలంలో దుప్పట్లు, విద్యార్థులకు, నోటుపుస్తకాలు, బట్టలు, నిత్యావసర సరుకులు అందజేశారు.

## 'చలో ప్రజా భవన్'ను జయప్రదం చేయండి




ప్రజాపక్షం/సత్తుపల్లి: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12న జరగనున్న చలో ప్రజాభవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (పిఎస్‌సిడబ్ల్యూయు) సత్తుపల్లి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో సమంత క్యాంపులో జేఏసీ పోస్టర్ ఆవిష్కరించి, జనరల్ బాడీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్లపూడి శరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలో వచ్చి 20 నెలల కావస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12న జరుగు కార్యక్రమానికి కార్మికులందరూ ప్రజాభవన్ తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కట్ల ప్రసాదు, వై కనకయ్య, రవి, వర్మ, నరేష్, కె వెంకటేష్,వై ప్రసాద్, ఎండి ఖలీల్ బాబా, బి రమేష్, ఎస్ కే యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక ఉత్సవాలు



ప్రజాపక్షం/పాల్వంచ : వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా జరిపించారు. పాల్వంచలో సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు చోట్ల అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా 8వ, రోజు వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిపిస్తున్న వినాయక నవరాత్రుల్లో బుధవారం నాని శర్మ నేతృత్వంలో మహిళలచే వైభవంగా అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీ సత్యనారాయణ వ్రత వేడుకలను జరిపించారు. చిన్నారులచే భగవద్గీత, భక్తి గీతాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి అధ్యక్షులు చలవాది ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గూడెపు శ్రీనివాస్, మహిళా కమిటి అధ్యక్షురాలు పెండ్యాల రోజాలక్ష్మి, వర్తక సంఘం అధ్యక్షులు పెండ్యాల క్రిష్ణమూర్తి, కంటాల రిత్విక్, కొత్తగుండ్ల సుబ్బలక్ష్మి, కుటుంబరావు, చవ్వా సంతోష్, వంకధార ఇందిర, దీప్తి, సౌజన్య, హరీష్, నాగ, సనీత, మౌనిక, పద్మజ, సరోజ, సంకా రమ, భువన, బిందు, ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌విఆర్‌పై మండలస్థాయి శిక్షణ




ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్‌హెచ్‌విఆర్ (స్వచ్ఛత మరియు హరిత విద్యాలయ రేటింగ్స్) 2025కు సంబంధించిన మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి జి. మంజుల అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా మండల రిసోర్స్ పర్సన్ జె. వెంకటేశ్వర్లు, బి. బావ్ సింగ్ మాట్లాడుతూ పాఠశాలల్లో శుభ్రత, పరిశుభ్రతా ప్రమాణాలు, సచివాలయాల వినియోగం, తాగునీటి సదుపాయాలు, వ్యర్థపదార్థాల నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మండల రిసోర్స్ పర్సన్ బి. బావ్ సింగ్, జై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హరిత చర్యలు, చెట్లు నాటడం, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థులలో పర్యావరణ స్నేహ భావన పెంపొందించడం పై వివరించారు. పై అంశాల వారిగా యాప్ ఆన్లైన్ పోర్టల్లో నమోదు చేస్తే ఆ పాఠశాలకు స్టార్ రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొని రాబోయే విద్యా సంవత్సరంలో ఎస్‌హెచ్‌విఆర్ ప్రమాణాలను పాటించే విధానంపై చర్చించి తమ సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందరూ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## రామాలయం వద్ద అన్నప్రసాద వితరణ



ప్రజాపక్షం/గుండాల : వినాయక నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలో రామాలయ కమిటి ఆద్వర్యంలో బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిచారు. కార్యక్రమానికి భక్తులు వందల సంఖ్యలో పాల్గొని రామాలయం వద్ద వినాయక మండపంలో ప్రతిష్టించిన స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా కమిటి అధ్యక్షులు తిరుకవళ్ళూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వినాయక స్వామి నవరాత్రులలో బాగంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిచడం ఆనవాయితీగ వస్తుందన్నారు. కార్యక్రమంలో విగ్రహదాత మానాల వీరన్న, కోదూరిశ్యాం, యాసారపు సురేష్, గుండెబొయిన లక్ష్మి నారాయణ, పిల్లి క్రిష్ణ, మానాల వెంకటేశ్వర్లు, నారాయణమూర్తి, ఎం ప్రభాకర్, ఎం శ్రావన్, రామాలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు బోధన పరికరాలతో అవగాహన



ప్రజాపక్షం/గుండాల : ఉపాధ్యాయులకు భోదన పరికరాలు తరగతి గదిలో భోదనను సులబతరం చేస్తాయని మండల విద్యాదికారి పార్వతమ్మ అన్నారు. బుదవారం మండల కేంద్రంలోనిజిల్లాపరిషత్ పాఠశాలలో మండలస్థాయి టిఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోదన పరికరాలతో విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేలా భోదన చేయడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. రేఖాచిత్రాలు, బొమ్మలు, విత్తనాలు, కాగితాలు, స్థానికంగా లభించే వివిద వస్తువులతో ఉపాధ్యాయులు తయారు చేసిన భోదన పరికరాలను ప్రదర్శించారు. మండల స్థాయిలో ప్రతిభ కనపరిచిన పది ఎగ్జిబిట్‌లను జిల్లా స్థాయి టిఎల్ఎం మేళాకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో మొదటి ప్రదమ స్థానం వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ వి రాజశేఖర్, సిసిఒ మాచర్ల రంజిత్, సిఆర్పీలు విజయ, రామచంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్‌కు కనీస మద్దతు ధర కల్పించాలి

**-కేంద్ర వ్యవసాయ మంత్రిని కలిసిన మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ. 25వేలు కనీస మద్దతు ధర కల్పించేలా చూడాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచి ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ. 25వేలు కనీస మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ యంత్రాలపై, మైక్రో ఇరిగేషన్ పరికరాలపై ఉన్న 12 శాతం జీఎస్టీని మినహాయించాలని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి సూచించారు. తెలంగాణలో నారాయణపేట, ములుగు, కొమరంభీం, ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను ప్రధాన మంత్రి దన్ ధాన్య కృషి యోజన (పిఎండిడికెవై) పథకంలో చేర్చాలని మంత్రి తుమ్మల కోరారు. ఫాస్పరస్, పోటాషియం, సల్ఫర్ వంటి పోషకాలపై సబ్సిడీ పెంచి యూరియాతో సమానంగా ధరలో సమతుల్యత తీసుకు రావాలని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రంలో రైతులకు యూరియా కొరత రాకుండా ఉండేందుకు రాష్ట్రానికి కేటాయించిన కోటా మేరకు సరఫరా చేయాలని కోరారు.

# బ్యాంక్ మేనేజర్‌కు ఘనసన్మానం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** విధి నిర్వహణలో ఎంతో అంకితభావంతో సేవలు అందించిన తిరుమలాయపాలెం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ అన్వేష్ బదిలీపై మణుగూరు బ్రాంచ్‌కి వెళ్తుంగా తిరుమలాయపాలెం బ్యాంక్ పరిధిలో ఉన్న విఓఎలు ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజర్ అన్వేష్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలు తిరుమలాయపాలెం బ్యాంక్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని, విఓఎలు పొదుపు సంఘాల మహిళలకు రుణాలు ఇప్పించడం తిరిగి కట్టించడంలో ఎంతో అంకితభావంతో పనిచేశారని, వారి సేవలను ఎప్పుడు గుర్తుపెట్టుకుంటానని ఆయన తెలిపారు. పొదుపు సంఘాల మహిళలు రుణాలను తీసుకుని తిరిగి చెల్లించినట్లయితే ప్రభుత్వం ద్వారా వడ్డీలేని రుణాలు పొందవచ్చునని, ప్రతిఒక్కరూ పొదుపు సంఘాల మహిళలు తమ వ్యక్తిగత ఇన్సూరెన్స్‌ను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ వేణు, దయాకర్, క్యాషియర్ ఉపేందర్, అకౌంటెంట్ సంధ్యారాణి, అటెండర్ సునీత, ఉమేష్, విఓఎలు కరుణ, కృష్ణవేణి, ఉపేంద్ర, కుసుమ, జ్యోతి, విజయ, నాగమణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

# ఆ పాఠశాలలో విద్యార్థినులే పనిమనుషులు..!

**-పనిచేయకపోతే పాఠాలు చెప్పరంట**
**-అంతా మా ఇష్టమంటున్న ఉపాధ్యాయుడు**








**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బ్రాహ్మణపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే అందుకు వచ్చిన చిన్నారులైన బాలికలను పాఠశాల ఆవరణలో ఉప్పించడం జరుగుతుంది. ఎవరైనా ఆయన చెప్పిందే వినాలి అంటే, చిన్నారులు పాఠశాల ఆవరణ శుభ్రం చేయకపోతే పాఠాలు చెప్పరంటూ ఎవరైనా అడిగితే అంతా నా ఇష్టం నేను చెప్పిందే వేదం అని అంటాడు ఆ ఉపాధ్యాయుడు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినిలను ఎంత కష్టపెడుతున్నారో చూడండి. ప్రభుత్వం ఒక పక్క విద్యారంగానికి పెద్ద పీఠ వేస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం చేయాలనే దిశగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కనిపిస్తూ వారికి ఎలాంటి ఇబ్బంది కలగవద్దు అని చూస్తుంటే దానికి విరుద్ధంగా వైరా బ్రాహ్మణపల్లి 8వ వార్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పంతులుకు పట్టింపు లేదంట. ఆ విద్యార్థి నీళ్లతో ఉదయం పాఠశాలకు రాగానే పాఠశాల ఊడ్చిన తర్వాత తరగతులు వినాలంట. ఇదెక్కడ చోద్యం అని ఎవరైనా అడిగితే నా ఇష్టం నేను మీకు చెప్పాల్సిన అవసరం లేదు. మీడియా కాని, అధికార యంత్రాంగం కాని నన్నేమి చేయలేదు అనే వాదన ఆ ఉపాధ్యాయుడు వద్ద వినిపిస్తుంది. జిల్లా అధికారులు విద్యార్థులతో వెట్టిచాకిరి చేయిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# గణనాధుడికి ప్రత్యేక పూజలు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని లీలా సుందరయ్యనగర్‌లో తాండ్ర పెద్ద బ్రహ్మయ్య నివాసం వద్ద ఏర్పాటు చేసిన సాయిగణనాథ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని గణనాధుని బుధవారం వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు, వైరా ఎస్సై పి.రామారావుతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ప్రతి సంవత్సరం లీలా సుందరయ్యనగర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రతిరోజు పూజా కార్యక్రమానికి వందల సంఖ్యలో భక్తులు పాల్గొని గణనాధుని పూజిస్తారు. వైరాలోనే లీలాసుందరయ్యనగర్ గణనాధుడు అంటే ప్రత్యేక పూజలకు నిలయం అనే వాదన మాట ప్రతి సంవత్సరం గణపతి నవరాత్రులు సందర్భంగా వినిపిస్తుంది.

# మధ్యాహ్నం భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందేనని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య తో పాటు పలు అంశాల పై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనంను చేశారు. నాణ్యత పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించకుండా అప్రమతంగా ఉండాలని సూచించారు. పాఠశాలఆవరణలో పిచ్చి గడ్డి లేకుండా ఎప్పటికప్పుడు తీయించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ రకాల పూల మొక్కలతో కళకళలాడే విధంగా మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలలుఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతి రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడుపాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఓ ఇంట్లో ఉన్న బాలికపై దుగ్గిరాల రత్తయ్య అనే 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేస్తూ బయటకు పరుగులు తీయడంతో పారిపోతున్న నిందితుడిని స్థానికులు పట్టుకని పోలీసులకు అప్పగించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి... ఖమ్మం జిల్లా వైరాలో ఓ ఇంట్లో వంట చేస్తున్న మైనర్ బాలికను గమనించి దుగ్గిరాల రత్తయ్య అనే వ్యక్తి(40) బండి తాళం ఇవ్వమంటూ ఇంట్లోకి చొరబడి బాలికను వెనుక నుంచి అసభ్యంగా శరీరాన్ని తాకుతూ ముద్దు పెట్టుకొని బలాత్కారానికి ప్రయత్నించడంతో బాలిక కేకలు వేస్తూ బయటకు పరుగు తీసింది. కేకలు విని చుట్టుప్రక్కల ఉన్న స్థానికులు వచ్చి చూడగా ఇంట్ల నుండి బయటికి పరుగు తీస్తున్న దుగ్గిరాల రత్తయ్యను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుడు రత్తయ్య గతంలో కూడా కొంతమంది పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని స్థానికులు, బంధువులు కోరుతున్నారు. బాలిక ఫిర్యాదు మేరకు వైరా ఎస్సై పి.రామారావు ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అన్ని రాజకీయ పార్టీలు దివ్యాంగులకు అవకాశం కల్పించాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు దివ్యాంగుల కు అవకాశం కల్పించాలని టీడీజేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య కోరారు. మండలం లోని చెన్నారంలో బుధవారం సంఘం సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలం లోని ప్రతీ పంచాయతీలో వార్డులను దివ్యాంగులకు ఏకగ్రీవం చేయాలని అందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. అదే విధంగా ప్రతీ పార్టీ నాలుగు గ్రామ పంచాయతీలను దివ్యాంగులకు సర్పంచ్ అభ్యర్థులుగా ప్రకటించాలని కోరారు. రాజకీయంగా దివ్యాంగులు ఎదిగేందుకు సహకరించాలని కోరారు. సంఘం తరుపున పోటీ చేసిన దివ్యాంగుల స్థానాల ను ఏకగ్రీవం చేసేందుకు సహకరించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు తాము స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రామకృష్ణ, భాస్కర్ రావు, నాగరాజు, రామారావు, లక్ష్మి, వెంకన్న, పుల్లయ్య, నాగలక్ష్మి, రేణుక, వెంకటమ్మ, నాగేశ్వరరావు, సువర్ణ పాల్గొన్నారు.

# సైబర్ క్రైంపై విద్యార్థినులకు అవగాహన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండలో గల ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో సైబర్ క్రైమ్‌నివారణపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పి ఫణిందర్..డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నేర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, సైబర్‌క్రైమ్ ఎస్ఐలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, కళాశాలకు చెందిన వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకబృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఐఎన్‌టియుసికి భారీ గండి



**300 మంది కార్మికులతో బిఆర్‌ఎస్‌లో చేరిన ఊకంటి ప్రభాకర్ రావు**

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి మణుగూరు ప్రాంతంలో ఐఎన్టీసీకి భారీ గండి ఏర్పడింది. ఐఎన్ సికు చెందిన ఊకంటి ప్రభాకర్ రావు బుధవారం సాయంత్రం ఐఎన్‌టిసికు చెందిన 300 మంది కార్మికులతో కలిసి టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వం అమల్లో ఉన్నప్పుడు జరిగిన సింగరేణి కార్మికు గుర్తింపు సంఘ ఎన్నికలలో ఊకంటి ప్రభాకర్ టీబీజీకేఎస్ నుండి మణుగూరు ఏరియాలో గెలిచి, నాలుగు సంవత్సరాల పాటు కార్మిక సంఘ అధ్యక్షునిగా కొనసాగారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచిన తర్వాత కొద్ది నెలకి ఆయన కాంగ్రెస్ అనుబంధం యూనియనైన ఐఎన్‌టియూసి లో చేరారు. బుధవారం పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో ఆయన టిఆర్ఎస్ తీర్థం పుచ్చుకొని మరల తిరిగి టీబీజీకే యూనియన్ కి సారధ్యం వహించినట్లుగా తెలుస్తుంది. ఊకంటి ప్రభాకర్ రావు టిఆర్ఎస్ లో చేరడంతో సింగరేణి మణుగూరు ఏరియా ప్రాంతంలో ఐఎన్టీసీకి అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి గట్టి దెబ్బ తగలనున్నది.

# ప్రధాన సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే..

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మూడేళ్ళకు ఒకసారి ప్రతిష్టాత్మకంగా జరిగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్తుపల్లి యూనిట్ ఎన్నికలు బుధవారం సత్తుపల్లి లోని సంఘ భవనంలో జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలో యూనిట్ అధ్యక్ష కార్యదర్శులుగా కేశవరెడ్డి, సూర్య ప్రకాశరావు లను ఎన్నికయ్యారు. ఆర్థిక కార్యదర్శిగా జి.కృష్ణయ్య, సహాధ్యక్షులుగా బూరుగు దాసు,ఉపాధ్యక్షులుగా డి.కృష్ణయ్య, వాణి, సహాయ కార్యదర్శులుగా సాంబశివరెడ్డి, నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా మధుసూదన రాజు, జిల్లా కౌన్సిలర్ లుగా యోగానందం,కమల కుమారి, మహబూబ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన వేల్పుల కృష్ణయ్య,రఘుపతి రెడ్డి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు.

**వేచి చూస్తున్నాం...ఉద్యమించడానికి సిద్ధమే...**

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాచివేత ధోరణిని మనిస్తున్నామని, అనివార్యమైతే విశ్రాంత ఉద్యోగులుగా ఉద్యమానికి సమాయత్తంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కళ్యాణం కృష్ణయ్య, సుబ్బయ్యలు ప్రకటించారు. బుధవారం సత్తుపల్లి లోని సంఘ కార్యాలయంలో కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రిటైరైన ఉద్యోగులు సంవత్సరాల తరబడి తమకు రావలసిన డబ్బుల కోసం ఆవేదనతో ఎదురు చూస్తున్నారని అన్నారు. హైదరాబాదులో మంగళవారం ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం జరిపిన




చర్చలలో ఎలాంటి ప్రయోజనం కలగలేదని ఆవేదన వ్యక్తం చేసారు. విశ్రాంత ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న బకాయిల సాధన కొరకు అవసరమైతే ఉద్యమిస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేసారు.డిఏ బకాయిలు,పిఆర్సీ లపై చర్చే జరగలేదు.హెల్త్ కార్డుల విషయంలో అనేక మార్లు సమావేశాలు జరిపిన ప్రభుత్వం ఇకా చర్చిస్తామనే అంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలన్నిటికీ లిఖిత పూర్వక ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు బద్రుద్దీన్, అద్దంకి వెంకటరత్నం, రామిశెట్టి సుబ్బారావు, బివి.రామారావు, సరోజిని, సూరా సత్యనారాయణ, మాధవరెడ్డి, రత్తయ్య, పూర్ణ చంద్రరావు తదితరులు సత్తుపల్లి, వేంసూరు మండలాల నుండి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు రాత పుస్తకాల వితరణ ప్రారంభం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు స్ఫూర్తి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఒక పలక, ఒక బలపం, ఒక పుస్తకం, ద్వారా రాత పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కల్లూరు ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఒక మంచి కార్యక్రమానికి ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, పాఠశాలను దేవాలయంగా, గురువులను దేవుళ్ళుగా భావించి విద్యార్థులు కష్టపడి చదివితే వారు ఉన్నత స్థానంలో ఉంటారని సూచించారు. మంచి చదువులు చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. అదేవిధంగా ఫౌండేషన్ చైర్మన్ శ్రీ వ్యాల్ కు ధన్యవాదములు తెలిపారు మరియు దాతల ద్వారా స్వీకరించిన విరాళం ద్వారా పాఠశాలల లోని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు ఖమ్మంపాటి యశ్వంత్ సాయి కు ఎన్ ఐ టి చదు




వుతున్న విద్యార్థికి 62,500 చెక్కును విద్యార్థి తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి




**ప్రజాపక్షం/దమ్మపేట:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రుగొండ వస్తున్న సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు పండురి వీరబాబు, సిపిఎం నాయకులు పిట్టల అర్జున్, సిఐటియు నాయకులు కొప్పుల శ్రీనివాస్, గొర్రెపాటి బసవయ్య, ప్రజా సంఘాల నాయకులను అక్రమంగా ముందస్తుగా అరెస్టు చేయటాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము ఖండించారు. బుధవారం దమ్మపేట పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో రాము మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయటం హేయమైన చర్య అని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఈ హామీలు అమలు చేయకపోవడమే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల ముందుకు రావాలంటే భయపడుతుందని, అందులో భాగమే ఈ ముందస్తు అరెస్టులని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఈ అక్రమ అరెస్టును ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు, నాయకులు కేసరి వెంకటేష్, గంగాధర నాగమణి, జుంజునూరి ముక్తేశ్వరి, జుంజునూరి నాగరాజు పాల్గొన్నారు.

# యూరియా కోసం రాస్తారోకో



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండలంలో బుధవారం యూరియా కోసం రైతులు రోడ్డుపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని రైతులకు ప్రభుత్వం సరిపడ యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రోజుల తరబడి వ్యవసాయ పనులు మానుకొని సోసైటీ కేంద్రాల వద్ద పడి గాపులు కాస్తున్నా యూరియా దొరకని పరిస్థితి నెలకొందని ఇప్పటికే మొక్కజొన్న చివరి దశలో ఉందని, అదునుకు యూరియా వేయకపోతే పంట దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సొసైటీ అధికారులు రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలని కోరారు.

# రేవంతుడి ఆశీర్వాదం అందుకున్న విజయుడు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాల పాడు గ్రామం లో బుధవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బూర్గంపాడు మాజీ జెడ్‌పిటిసి బట్టా విజయ్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు తోడ్పాటుతో కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రేవంతుడి ఆశీస్సులు ఆదుకోవడంతో ఆయన ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో పార్టీకి విధేయుడిగా ఉండి పాయం వెంకటేశ్వర్లు గెలుపుకి శక్తి వంచన లేకుండా కృషి చేసిన ఆయనను గురంతించి రేవంత్‌రెడ్డితో కల్పించిన మంత్రికి ఎంఎల్‌కి కృతజ్ఞతలు తెలిపారు.



# అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం తిర్లాపురం గ్రామపంచాయతీ 20 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతన అంగన్‌వాడి బిల్డింగ్ నిర్మాణానికి బుధవారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరేష్, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, గుండగాని నాగేశ్వరరావు, సంకపెల్లి రవీందర్ రెడ్డి, ఎండి రహీం పాషా, సీతయ్య, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ పంచాయితీ కార్మికుల ధర్నా

**ప్రజాపక్షం/కారేపల్లి:** మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ వేతనాలు, కనీస వేతనం అమలు చేయాలని తదితర సమస్యలపై తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిసస్ అండ్ వర్కర్ యూనియన్(సిఐటియు అనుబంధం)రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సింగరేణి మండలంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ధర్నాను ఉద్దేశించి సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా గ్రామ పంచాయితీ కార్మికులుగా పని చేస్తున్న అనేక సమ్మెలు ఆందోళనలు పోరాటాలు దశలవారీగా నిర్వహించిన, గత ప్రస్తుత ప్రభుత్వాలు సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడం లేదని ఇది కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నట్లుగా ప్రభుత్వాలను భావించవలసి వస్తుందని విమర్శించారు. అనంతరం ఎంపీడీవో, ఎంపీవోకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో యూనియన్ సింగరేణి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ నాగేశ్వరరావు, ఎస్‌కె హుస్సేన్, కార్మికులు బాలయ్య, జి శ్రీను, నంద, వజ్జా భాస్కర్, చల్ల నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జగణపయ్యను దర్శించుకున్న కూసంపూడి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మున్సిపాలిటి పరిధిలోని జవహర్ నగర్ జంగాల కాలనీలో ఏకదంతాయ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాని మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ బుధవారం సందర్శించి స్వామి వారి ఆశీస్సులు తీసుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి అనిల్, పర్వతనేని వేణు, ఉప్పు హనుమంతు, తిరుపతి శ్రీను, గుంజ వెంకటేశ్వర రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఒకే గదిలో రెండు తరగతుల నిర్వహణ..!

**-వర్షం వస్తే అంతా ఒకచోటే.. చెట్ల కింద వంటలు**
**-అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని కష్టాలే..**
**-పట్టించుకోని అధికారులు**



**ప్రజాపక్షం/కూసుమంచి:** కలెక్టర్ సార్ మా బడులకు రండి మా చదువుల బాధలు చూడండి అంటూ ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను కోరుతున్న పాఠశాలల విద్యార్థులు, కూసుమంచి మండలంలోని కొన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, పాఠశాలలలో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

### ఒకటే గదిలో రెండు తరగతుల నిర్వహణ....

నేలపట్ల ప్రాథమిక పాఠశాలలో 45 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ విద్యార్థులు చదువుకోవడానికి ఎంత కష్టాలు పడుతున్నారో మాటల్లో చెబితే సరిపోదేమో అనిపిస్తుంది. నేలపట్ల స్కూల్‌లో ఐదు తరగతులకు రెండే తరగతి గదులు మాత్రమే పాఠాలు చెప్పాలంటే ఉపాధ్యాయులకు టీచర్లకు అత్యంత కష్టంగా మారింది. ఒక గదిలోనే రెండు తరగతులు క్లబ్ చేసి పాఠాలు చెప్తున్నారు అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### చెట్టు కిందనే వంట...

నేలపట్ల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండటానికి వంట గది లేక పోవడంతో చెట్టు కిందనే వంట చేస్తూ అనేక అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే మధ్యాహ్న భోజనం ఎలా వండి పెట్టాలో అర్థం కాని దుస్థితిలో కాలం గడుపుతున్నారు. ఇంకా ఈ బడిలోనే విద్యార్థులకు ఉపాధ్యాయులకు మూత్రశాలలు లేవు ఉన్న మూత్రశాలలో రిపేర్‌లో ఉండే పిచ్చి మొక్కలతో పాములు తేళ్లు ఉంటాయోమో అని భయాన్ని సృష్టించే విధంగా ఉన్నాయి వాటిని వాడాలంటేనే విద్యార్థులకు ఏమైనా జరుగుతుందేమోనని ఓ పక్క ఉపాధ్యాయులు దిన దిన గండం నూరేళ్ల భావిస్తున్న పరిస్థితి ఉన్నది.




### వర్షం వస్తే పక్షుల్లా ఒకే చోట...

నేలపట్ల ప్రాథమిక పాఠశాలలో వర్షం వచ్చిందంటే విద్యార్థులకు ఉపాధ్యాయులకు భయం భయం అన్ని తరగతి గదులు వర్షానికి కురవడంతో కొరవని చోట ఒకే గదిలోకి అందరూ చేరుకొని గుంపుగా పక్షుల్లా ఒకే చోట ఉంటూ వర్షం ఎప్పుడు పోతుందా అని ఎదురుచూస్తున్న దుస్థితి ఈ పాఠశాలలో నెలకొని ఉన్నది.

### పూర్తికాని అదనపు గదులు...

నేలపట్ల ప్రాథమిక పాఠశాలలో 202324 విద్యా సంవత్సరంలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా రెండు అదనపు గదులు మంజూరు అయినవి నిర్మించడం పూర్తయిన తర్వాత వాటిని 2025 విద్యా సంవత్సరం ఏప్రిల్ వరకు కూడా పూర్తి చేయలేదు, ఇప్పటి వరకు వాటిని పూర్తి చేయలేదు ఇప్పటి వరకు వాటిని పూర్తి చేయకపోవడంతో తరగతి నిర్వహణకు ఇబ్బందిగా ఉన్నదని విద్యార్థులు స్థానిక ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

### నరసింహులగూడెం పాఠశాల దుస్థితి...

కూసుమంచి మండలంలోని నరసింహులుగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాల దుస్థితి కూడా నేలపట్ల పాఠశాల దుస్థితికి భిన్నంగా లేకుండా తీసిపోని విధంగా ఉన్నది. ఇక్కడ మొత్తం ఏడు తరగతులు ఉన్నప్పటికీ ఐదు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. మొత్తం 84 మంది విద్యార్థులు చదువుతూ ఒక వరండాలో రెండు తరగతుల నిర్వహణ చేస్తున్నారు ఇంకా వర్షం వస్తే ఒకే గదిలో రెండు తరగతుల నిర్వహణ జరుగుతున్నది.



### వంట గదిలోనే తరగతి గది నిర్వహణ...

ఇక్కడ పాఠశాలలో వంట గదికి ఉపయోగించాల్సిన గదిలోనే ఓ పక్క సామాన్లు ఉన్నప్పటికీ మరోపక్క పాఠాలు బోధన చేస్తున్నారు. ఇటువంటి దుస్థితిలో ఉపాధ్యాయులు తమ వృత్తి ధర్మాన్ని విస్మరించకుండా పాటిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారు. ఈ దృశ్యాన్ని చూసిన మరెవరికైనా బాధ కలిగించక మానదు.

### పూర్తికాని అదనపు గది నిర్మాణం....

ఈ పాఠశాలకు సైతం అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఒక అదనపు గది నిర్మాణం చేపట్టి దానినే మధ్యలోనే వదిలేయడంతో తరగతి గదులు నిర్వహించడానికి సమస్యగా మారింది వర్షం వస్తే ఒకే గదిలో విద్యార్థులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

### ప్రభుత్వ నిర్లక్ష్యం అంటున్న జనం...

విద్యార్థుల చదువులకు వసతులు లేక ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వ అధికార యంత్రాంగ మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితిని పసి హృదయాలకు సైతం అర్థమయిపోతుందని ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు నిర్లక్ష్యాన్ని విడమర్శి యుద్ధ ప్రాతి పదికన నిర్మించిన తరగతి గదుల పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. విద్యార్థుల చదువులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

### ఎంఈఓ వివరణ....

కూసుమంచి మండలంలోని నరసింహాలగూడెం, నేలపట్ల, పాఠశాలలో నెల కొన్న సమస్యలపై మండల విద్యాశాఖ అధికారి బివి రామాచారిని ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా అమ్మ ఆదర్శ పాఠశాలల బిల్లులు రావాల్సి ఉన్నది అని ఇంకాపై అధికారులను కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు.

---

# రూ.5కోట్లు గంగలో పోసిన పన్నీరేనా..?

**-కార్యాలయ నిర్మాణం సరే...**
**జిఎం నియామకమెప్పుడో?**
**-సింహభాగం బొగ్గునందించే సత్తుపల్లికి**
**జిఎం నియామకం లేనట్లేనా..?**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కొంగు బంగారమైన సింగరేణికి సత్తుపల్లిలోని సింగరేణి ఘనులు ఓ బంగారు బాతులాంటివి. బొగ్గు ప్రాజెక్ట్‌లో సత్తుపల్లి సింహభాగం బొగ్గును సత్తుపల్లి ఘనులు అందిస్తున్నాయి. ఇక్కడ అధికారులు, కార్మికులు, సిబ్బందికి మెరుగైన సేవలందించాలన్నా, సత్తుపల్లి మరింత అభివృద్ధి చెంద్దాలన్నా, సత్తుపల్లి ఘనులు మరింత ముందుకు వెళ్ళాలన్న జిఎం నియామకం తప్పనిసరి. అంత ప్రాధాన్యత ఉన్న జిఎం నియామకం సత్తుపల్లి ఘనులకు అందని ద్రాక్షగానే ఉన్నాయి. సుమారు రూ. 5 కోట్లతో హంగూ, ఆర్భాటాలతో 3 సంవత్సరాల క్రితం జిఎం కార్యాలయ భవనం నిర్మాణం జరిగింది. కానీ జిఎం నియామకం లేకపోవటంతో వాడుకలో లేకుండా పోతుంది. ఆధునిక సౌకర్యాలతో, విస్తీర్ణంలో విశాలంగా, సిబ్బందికి అనువుగా ఉండేలా తీర్చిదిద్దిన ఈ ఆఫీస్ ప్రస్తుతం వర్షపు నీటితో చిన్నపాటి చెరువును తలపిస్తుంది. లోతట్టు ప్రాంతంలో నిర్మాణం ముందుచూపు లేని అధికారులు జిఎం కార్యాలయ నిర్మాణంలో ముందు చూపు లేకుండా అడ్డగోలుగా నిర్మించారని కార్మికులు పెదవి విరుస్తున్నారు. ప్రధాన రహదారి కంటే సుమారు మూడు నుండి నాలుగు అడుగుల లోతులో నిర్మాణం జరగటంతో వర్షం వస్తే కార్యాలయం చుట్టూ చిత్తడిగా మారుతుందని కార్మికులంటున్నారు.

### భవనం సరే జిఎం ఎక్కడ..?

ఒక ప్రాజెక్ట్‌కు వెన్నెముకగా ఉండే పదవి జనరల్ మేనేజర్ (జిఎం). కానీ సింహబాగం బొగ్గునందించే ఈ కీలక ప్రాజెక్ట్‌కు ఇప్పటికీ జిఎం నియామకం జరగకపోవడం ఆశ్చర్యకరం. సిబ్బంది, కార్మికుల సమస్యలన వినేవారు లేరు. ఎటు వెళ్లినా జిఎం లేరన్న ఒకే సమాధానం ప్రతి పనికి సుమారు 70 నుండి 80 కిలో మీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడెం వెళ్లాల్సిందే, అలా వెళ్ళిన ప్రతిసారి కార్మికులు, సిబ్బంది శెలవు పెట్టాల్సిందే నంటూ కార్మికులు వాపోతున్నారు. కార్మికుల ఆవేదనరోజువారీ సమస్యలు, సాంకేతిక అవాంతరాలు, బొగ్గు సరఫరాలో



లోపాలు... ప్రతి పరిష్కారం కోసం ఇక్కడి కార్మికులు తిప్పలు పడుతున్నారని, సమస్యలు పరిష్కరించే వారు ఎవరూ పట్టించుకోకపోవడంతో మాకు కార్యాలయం ఉంది కానీ అధికారి లేకపోవటంతో నానా ఇబ్బందులు పడుతున్నామని సింగరేణి కార్మికులు వాపోతున్నారు.

### ప్రజాధనం వృథా..?

భవనం నిర్మాణానికి వెచ్చించిన కోట్లాది రూపాయలు వాడుకలో లేకపోవడం వల్ల వృథా అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి వర్షాకాలంలో భవనం పరిసరాలు నీట మునిగిపోవడంతో ప్రజాధనం 'గంగలో పోసిన పన్నీరు' అన్న సామెతను తలపిస్తోందంటున్నారు మేధావులు. అన్ని పరిశ్రమలకు ఇక్కడి నుండే పలు పరిశ్రమల నిర్వహణకు మూలమైన బొగ్గును సింగరేణి సిగలో సింహబాగమైన సత్తుపల్లి ప్రాజెక్ట్ అందిస్తుందని, లాభాల్లో కూడా సత్తుపల్లికి అగ్రభాగమేనని,ఇంత ప్రాధాన్యం ఉన్న ప్రాంతాని సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం చేయడంపై కార్మిక సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి."కార్యాలయం కోసం రూ.5 కోట్లు వెచ్చించారు. కానీ ప్రజలకు ఉపయోగం ఏమిటని..? జిఎం లేకుండా ప్రాజెక్ట్‌ను ఎన్ని ఏళ్ళు నడిపిస్తారని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు? సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ సింగరేణిపై దృష్టి పెట్టి జిఎం నియామకం జరిగేలా చర్యలు తీసుకోవాలని, జిఎం నియామకం జరిగితే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, స్థానికులకు చోటా, మోటా కాంట్రాక్టులు దక్కుతాయని, కార్మికులు, సిబ్బంది మోములో చిరునవ్వులు చిందుతాయని కార్మిక సంఘాల నాయకులంటున్నారు.

---

# స్థానిక ఎన్నికల కోలాహలం..!

**- పల్లెల్లో మొదలైన**
**రాజకీయ సందడి**
**- విడుదలైన నిర్వహణ షెడ్యూల్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధంగా ఉండటంతో పలెల్లో మరో సారి రాజకీయ కోలాహలం, సందడి మొదలైంది. ఈ నెలలో ఎన్నికలు జరిగే అవకాశం ఉండగా ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సర్క్యులర్ కూడా జారీ చేసింది. పదేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థానికంగా సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండగా, ఇవిగో ప్రభుత్వ వైఫల్యాలు అంటూ బిఆర్‌ఎస్ ఎత్తిచూపే ప్రయత్నం చేస్తూ తలపడేందుకు సమాయత్తం అవుతోంది. ఇదిలా ఉండగా కొత్తగూడెం ఎంఎల్‌ఏ స్థానాన్ని కైవసం చేసుకున్న సిపిఐ వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీలో నిలబడి ఆ పార్టీ తనకున్న బలాన్ని మరో సారి నిరూపించుకునేందుకు సిద్ధపడుతోంది. ఇక భద్రాచలం వంటి విచిత్ర నియోజకవర్గంలో పార్టీ ఫిరాయింపు వ్యవహారం ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. డా. తెల్లం వెంకట్రావు బిఆర్‌ఎస్ నుండి పోటీలో నిలబడి ఒక్క సారి అవకాశం ఇవ్వండి అంటూ వేడుకోవడంతో ప్రజలు ఓట్లేసి గెలిపించారు. కానీ బిఆర్‌ఎస్ అధికారంలోనికి రాక పోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రజల కోసం,ఈ ప్రాంత అభివృద్ధి కోసం అంటూ తుర్రున పార్టీ మారారు. దీనిని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఇదిలా ఉండగా పార్టీ ఫిరాయింపులపై న్యాయస్థానం సైతం గట్టిగా మందలించడంతో ఆ విషయం రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా ఉంది. తొలుత జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించనుండగా రెండో విడతలో గ్రామపంచాయితీలకు ఎన్నికలు జరపనున్నారు.

### పల్లెల్లో సందడి...

స్థానిక ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది అంటూ ఇసికి లేఖరాయంతో ఎన్నికల సంఘం సైతం నిర్వహణకు సంబంధించి సర్క్యులర్ జారీ చేయడంతో జిల్లా వ్యాప్తంగా స్థానిక ఎన్నికల సందడి పెల్లెల్లో మొదలైంది. జిల్లా అధికారులు ఎన్నికలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. కాగా 42 శాతం బిసి రిజర్వేషన్ వ్యవహారంలో కొంత అంతర్మథనం,



అయోమయం అశావాహుల్లో అలుముకుంది. పదేళ్ల నిరీక్షణ తర్వాత కాంగ్రెస్ అధికారంలోనికి రావడంతో పదువులు కోసం పోటీపడే వారి సంఖ్య పెద్దగానే ఉంది.

### సిద్ధంగానే...

ఎన్నికలు ఏ క్షణంలో వచ్చినా తాము సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, నోడల్ అధికారుల ఏర్పాటు పూర్తి చేశారు. పెద్దబాక్సులు 1811, మీడియం బాక్సులు 351 సిద్ధంగా ఉన్నాయి. ఇవే కాకుండా మరో కొన్ని బాక్సులు తెప్పించనున్నారు.

### 669024 మంది ఓటర్లు ...

జిల్లా వ్యాప్తంగా 6,69,024 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్లు 343967, పరుష ఓటర్లు 325033, ఇతరులు 24 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయితీలు 471, వార్డులు 4168, పోలింగ్ కేంద్రాలు 4242, జెడ్పిటిసి స్థానాలు 22, ఎంపిటిసి స్థానాలు 233 ఉన్నాయి.

### షెడ్యూల్ వివరాలు...

* ఈ నెల 6వ తేది నాడు మండలాల వారీగా ఎంపిటిసిలు, జెడ్పిటిసిల కోసం పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా ముసాయిదా ఎంపిడిఓల ద్వారా ప్రచురణ.
* 8వ తేదిన జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారుల సమావేశం, మండల స్థాయిలో ఎంపిడిఓలు, ఏడిఇఏఎస్ లతో సమావేశం.
* 06 నుండి 08 వ తేది వరకు అభ్యంతరాలు స్వీకరణ.
* 9వ తేదిన క్లెమ్‌లు, అభ్యంతరాలు,సూచనలు తొలగింపు
* 10వ తేదిన జిల్లా ఎన్నికల అధికారులు పోలింగ్ స్టేషన్ల జాబితా తుది ప్రచురణ.